సాక్షి అనకాపల్లి

గురువారం । 2 । మార్చి । 2023



బ్యాలెట్ బాక్స్‌లు సిద్ధం

అనకాపల్లిటౌన్: ఎమ్మెల్సీ ఎన్నికల కోసం తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది బ్యాలెట్‌బాక్స్‌లను బుధవారం సిద్ధం చేశారు.



20 ఎకరాల్లో తోటలు దగ్ధం

రావికమతంమండలం సామాలమ్మ పర్వతం సమీపంలో 20 ఎకరాల్లో జీడిమామిడి తోటలు దగ్ధమయ్యాయి. 8లో



రహదారులకు మహర్దశ

మాడుగుల నియోజకవర్గంలో రహదారులకు మహర్దశ పట్టింది. రోడ్ల రూపురేఖలు మారుతున్నాయి. 8లో

న్యూస్‌రీల్

సాయంతోనే దైవానుగ్రహం

కంచికామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామి



ప్రవచిస్తున్న స్వామీజి

తుమ్మపాల: సహాయ సహకారాల ద్వారా దైవానుగ్రహం సిద్ధిస్తుందని కంచికామకోటి పీఠాధిపతి జగద్గురు శంకర విజయేంద్ర సరస్వతి మహాస్వామిజీ అన్నారు. స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో హిందూ సనాతన ధర్మంపై ఆయన బుధవారం ప్రవచించా రు. ప్రతి ఒక్కరూ అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ధర్మకార్యాలు నిర్వహించాలన్నారు. ఇందుకు ధైర్యం, నమ్మకంతోపాటు పరస్పర సహకారం అవసరమని చెప్పా రు. ఆలయ ఆవరణలో గోసంరక్షణతోపాటు జ్యోతిర్లింగాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆల య అధ్యక్షుడు బిల్లపాటి కృష్ణకుమార్, ఆలయ కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోయరాజు, ఉత్సవ కమిటీ చైర్మన్ ఉప్పల శ్రీనివాసరావు పాల్గొన్నారు

శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

డిప్యూటీ డీఈవో ప్రేమ్‌కుమార్



మధ్యాహ్న భోజన పదార్థాలను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈవో ప్రేమ్‌కుమార్

చోడవరం రూరల్: పదవ తరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణతతో పాటు సబ్జెక్టుల్లో విద్యార్థులు పూర్తిస్థాయి మార్కులు సాధించడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు కృషిచేయాలని డిప్యూటీ డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ ఆదేశించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. బైజూస్ కంటెంట్‌ను అర్థం చేసుకోవడంలోనూ, దానిని అనుసరించడంలోనూ విద్యార్థులకు సహకారం అందించాలన్నారు. మధ్యాహ్న భోజన పథకంలో కొత్త మెనూను తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. ఉపాధ్యాయుల బోధనా డైరీలు, పాఠ్యప్రణాళికలు, గ్రేడింగ్ రిజిస్టర్లు, బైజూస్, ఇతర రికార్డులను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు.

అగ్నివీర్ నియామకాలకు దరఖాస్తుల ఆహ్వానం

మహారాణిపేట: అగ్నిపథ్ స్కీమ్‌లో భాగంగా ఆర్మీలో చేరేందుకు ఆన్‌లైన్ ద్వారా ఆసక్తి ఉన్న అవివాహిత పురుష అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని సెట్విస్ సీఈవో పి.నాగేశ్వరరావు తెలిపారు. అగ్ని వీర్ జనరల్ డ్యూటీ, అగ్ని వీర్ టెక్నికల్, అగ్నివీర్ క్లర్క్ స్టోర్ కీపర్ టెక్నికల్, అగ్నివీర్ ట్రేడ్స్‌మన్(10వ తరగతి ఉత్తీర్ణత), అగ్నివీర్ ట్రేడ్స్‌మన్(8వ తరగతి ఉత్తీర్ణత) పోస్టులు భర్తీ చేయనున్నట్లు చెప్పారు. అర్హులైన అభ్యర్థులు మార్చి 15వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని.. ఏప్రిల్ 17 నుంచి పలు స్లాట్లలో ఆన్‌లైన్ పరీక్షలు జరుగుతాయన్నారు. అభ్యర్థులు www.joinindianarmy.nic.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రిక్రూట్‌మెంట్ రెండు దశల్లో ఉంటుందని.. మొదటి దశలో కంప్యూటర్ ఆధారిత రాత పరీక్ష, రెండో దశలో రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహిస్తామన్నారు.

ఎలక్ట్రోమాగ్నెటిక్‌తో ఆటోమెటిక్ చార్జ్



ఎలక్ట్రోమాగ్నెటిక్ పరికరం

అనకాపల్లిటౌన్: విద్యుత్‌తో నడిచే వాహనాలకు ఆటోమెటిక్‌గా చార్జ్ చేసే ప్రాజెక్టును స్థానిక 'డైట్' కళాశాల విద్యార్థులు రూపొందించారు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ 4వ సంవత్సరం విద్యార్థులు బొడ్డపు కుమార్, ఎన్నేటి శ్రీలక్ష్మి, కోటకల తులసి, కాజులూరి తులసి రూపొందించిన ఈఎలక్ట్రోమాగ్నెటిక్ ప్రాజెక్టుద్వారా వాహనం వెళ్తున్నప్పుడు ఆటోమెటిక్‌గా రీచార్జ్ అవుతుంది. ఈ ప్రాజెక్టు తయారీలో కళాశాల హెచ్‌వోడీ డాక్టర్ పి.పూర్ణప్రియ సహకరించారు. ఈ మేరకు బుధవారం కళాశాల ఆవరణలో చైర్మన్ దాడి రత్నాకర్, ప్రిన్సిపాల్ చల్లా నర్సింహం, వైస్ ప్రిన్సిపాల్ ఆర్.వైకుంఠరావు విద్యార్థులను అభినందించారు.



ఏయూ గ్రౌండ్స్‌లో ఏర్పాటుచేసిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ వేదిక

పెట్టుబడుల సంబరానికి విశాఖ సిద్ధం

- గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్–2023కు సర్వం సన్నద్ధం
- ఏయూ వేదికగా రేపటి నుంచి రెండు రోజుల పాటు సదస్సు
- 26 దేశాల నుంచి 8 వేల మంది ప్రతినిధుల రాక
- రూ.100 కోట్లతో నగర సుందరీకరణ
- ఏపీ పెవిలియన్ పేరుతో 137 స్టాళ్లతో ఎగ్జిబిషన్
- వేదిక వద్ద ప్రారంభమైన రిజస్ట్రేషన్ల ప్రక్రియ

సాక్షి, విశాఖపట్నం: అడ్వాంటేజ్ ఏపీ పేరుతో రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, వనరులు, సౌకర్యాలను ప్రపంచానికి చాటి చెప్పేందుకు ఈ నెల 3, 4 తేదీల్లో విశాఖపట్నం వేదికగా నిర్వహించే గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్–2023కు దాదాపు ఏర్పాట్లు పూర్తయ్యాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటిసారిగా నిర్వహిస్తున్న పెట్టుబడుల సదస్సు కోసం రూ.100 కోట్లతో విశాఖ నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. మొత్తం 26 దేశాల నుంచి 5 వేల నుంచి 8 వేల మంది ప్రతినిధులు సదస్సుకు హాజరుకానున్నారని అంచనా వేస్తున్నారు. ఏయూ ఇంజినీరింగ్ మైదానం వేదికగా 3, 4తేదీల్లో నిర్వహించనున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్–2023కు 26 దేశాల నుంచి అతిథులు, పెట్టుబడిదారులు వస్తున్నారని అధికారులు స్పష్టం చేశారు. అతిథుల కోసం నగరంలోని పలు హోటళ్లలో 750కి పైగా గదులను ఇప్పటికే కేటాయించారు. వీటితో పాటు మరో 1000 గదులను పలువురు ప్రతినిధులు బుక్ చేసుకున్నారు. అతిథులను ఆయా హోటళ్ల నుంచి ప్రధాన వేదిక వద్దకు తీసుకొచ్చేందుకు నోడల్ అధికారులు, ప్రత్యేక సిబ్బందిని కలెక్టర్ డా.మల్లికార్జున ఆధ్వర్యంలో నియమించారు. అతిథులు బస చేసే హోటళ్ల వద్ద వైద్య బృందాలను సిద్ధం చేశారు. అతిథుల్లో కొందరు ప్రత్యేక విమానాల్లో విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకోనున్నారు. మరికొందరు ప్రత్యేక హెలికాప్టర్లలో ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. విశాఖ ఎయిర్‌పోర్టు నుంచి సీఎం వైఎస్ జగన్ కూడా హెలికాప్టర్‌లో సభా ప్రాంగణానికి చేరుకోనున్నారు. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమై.. రెండో రోజు మధ్యాహ్నం ఒంటి గంటకు ముగియనుంది. తొలి రోజు సాయంత్రం 6 గంటలకు వేదిక వద్ద సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించనున్నారు.

ప్రధాన ద్వారం వద్ద రిజిస్ట్రేషన్ కౌంటర్

పెట్టుబడిదారులు వచ్చే ప్రధాన ద్వారం వద్ద ప్రత్యేక రిజిస్ట్రేషన్ కౌంటర్ ఏర్పాటు చేశారు. ఇందులో 40 డెస్కులు ఏర్పాటు చేసి.. వాటి పర్యవేక్షణకు నోడల్ అధికారులు, సిబ్బందిని నియమించారు. బుధవారం నుంచే రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వెంటనే ప్రత్యేక కిట్ అందజేస్తున్నారు. అనంతరం వారికి కేటాయించిన స్టాల్, హాలు వివరాలను సంబంధిత సిబ్బంది వెల్లడిస్తున్నారు. ప్రధాన వేదికల్లో డెలిగేటెడ్ డైనింగ్ ఏరియాను దాదాపు 4 వేల మంది కూర్చొని భోజనం చేసే విధంగా ఏర్పాటు చేశారు. ప్రపంచ నలుమూలల నుంచి హాజరవుతున్న అతిథుల కోసం ప్రత్యేక మెనూ సిద్ధం చేశారు. ఏపీ సంప్రదాయ వంటకాలను తయారు చేస్తున్నారు.

సీఎం, ప్రముఖులకు ప్రత్యేక వేదిక

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోసం ప్రత్యేక వేదిక సిద్ధం చేశారు. మెయిన్ సెమినార్ హాలుకు అనుసంధానంగా ఈ వేదిక పనులు దాదాపు పూర్తయ్యాయి. సదస్సుకు సంబంధించిన వివరాలు అందించేందుకు వీలుగా సీఎం ఉండే వేదికలోనే మీడియా వ్యక్తులకు ప్రత్యేక చోటు కేటాయించనున్నారు. మీడియా బ్రీఫింగ్ కేంద్రం కూడా ఏర్పాటు చేస్తున్నారు. ప్రధాన వేదికలో ప్రారంభోత్సవ, ముగింపు కార్యక్రమాలు, పెట్టుబడులకు సంబంధించిన ఒప్పందాలపై సంతకాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. వీటితోపాటు మీడియా హాలులో వివిధ దేశాలకు చెందిన రాయబారులు, ఆయా దేశాలకు చెందిన ప్రతినిధులతో మన రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలపై సెమినార్లు జరగనున్నాయి.

ప్రత్యేక ఆకర్షణగా ఏపీ పెవిలియన్

ప్రధాన సెమినార్ హాలులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మొదటి రోజు ప్రసంగిస్తారు. సదస్సు ఉద్దేశాలను తెలుపుతూ ప్రారంభ ఉపన్యాసం చేసి మొదటి రోజు కార్యక్రమాలను ప్రారంభిస్తారు. ఈ మేరకు మెయిన్ హాలులో సుందరీకరణ పనులు ప్రత్యేక నిపుణుల ఆధ్వర్యంలో చేపట్టారు. మూడో హాలులో అన్ని రకాల కంపెనీలు, సదస్సులకు చెందిన సెమినార్లు నిర్వహించనున్నారు. సీఎంకి కేటాయించిన ప్రత్యేక వేదికకు సమీపంలో ఇంజినీరింగ్ కాలేజీ మైదానంలో మద్దిలపాలెం వైపు సుమారు 137 స్టాళ్లతో ప్రత్యేక ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తున్నారు. వీటికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రత్యేకంగా మారిటైం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, పోర్టు ఇండస్ట్రీలు, ఎంఎస్ఎంఈ కార్పొరేషన్, ఏపీఐఐసీ పరిధిలో ఉండే పరిశ్రమలు, గ్రామ సచివాలయాలు, పాఠశాల విద్య, పట్టణ ప్రణాళిక, పంచాయతీ రాజ్, స్కిల్ డెవలప్‌మెంట్ మొదలైన అంశాలకు సంబంధించిన అంశాలు ప్రదర్శించనున్నారు. ఈ ఏపీ పెవిలియన్ సదస్సుకే హైలెట్‌గా నిలవనుంది.

ఆయా హాళ్లలో సెషన్లు ఇలా...

గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో రెండు రోజుల పాటు వివిధ అంశాలపై సదస్సులు జరగనున్నాయి. వీటి కోసం ప్రధాన వేదికకు అనుబంధంగా సెమినార్ల నిర్వహణ కోసం ఓ ప్రత్యేక వేదికను నిర్మించారు.

తొలిరోజు

మార్చి 3 తొలి రోజున మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సెమినార్లు జరగనున్నాయి. హాలు–1లో ఐటీ, ఆటోమోటివ్, ఎలక్ట్రిక్ మొబిలిటీ, ఎలక్ట్రానిక్స్ తదితర అంశాలపై , హాలు–2లో ఇండస్ట్రియల్ లాజిస్టిక్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, స్టార్టప్స్, ఇన్నోవేషన్, వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్ మొదలైన అంశాలపై సెషన్లు నిర్వహించనున్నారు. హాలు–3లో పునరుత్పాదక ఇంధన వనరులు,, గ్రీన్ హైడ్రోజన్, హెల్త్‌కేర్, మెడికల్ ఎక్విప్‌మెంట్, ఏరోస్పేస్–రక్షణ రంగాలపై సెమినార్లుంటాయి. మీడియా హాలులో తొలి రోజు నెదర్లాండ్స్, యూఏఈ దేశాల సదస్సులు జరగనున్నాయి.

రెండో రోజు

సదస్సు రెండో రోజైన మార్చి 4న ఉదయం 9 నుంచి 10.30 గంటల వరకు సెషన్లుంటాయి. హాలు–1లో పెట్రోలియం–పెట్రో కెమికల్స్, స్కిల్ డెవలప్‌మెంట్ తదితర అంశాల్లో సదస్సులు నిర్వహించనున్నారు. హాలు–2లో ఉన్నత విద్య, టెక్స్‌టైల్స్–అపెరల్స్ తదితర అంశాలపై సెమినార్లు జరగనున్నాయి. హాలు–3లో టూరిజం– హాస్పిటాలిటీ, ఫార్మా, లైఫ్ సైన్సెస్ తదితర అంశాలపై సెషన్లు నిర్వహించనున్నారు. వీటితో పాటు మీడియా హాలులో వియత్నాం, వెస్టర్న్ ఆస్ట్రేలియా దేశాల సెమినార్లు జరుగుతాయి.

విశాఖకు సీఎం జగన్

- నేటి సాయంత్రం 5.15 గంటలకు రాక
- గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు హాజరు



సాక్షి, విశాఖపట్నం: ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం నుంచి మూడు రోజులపాటు విశాఖలో ఉండనున్నారు. శుక్ర, శనివారాల్లో నగరంలో జరగనున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్(జీఐఎస్)లో పాల్గొనున్నారు. ఆయన గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి గురువారం సాయంత్రం 5.15 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్డు మార్గంలో ఆరు గంటలకు రుషికొండలోని రాడిసన్ బ్లూ హోటల్‌కు చేరుకొని రాత్రి అక్కడే బస చేస్తారు.

- శుక్రవారం ఉదయం 9.10 గంటలకు ఏయూ ఇంజినీరింగ్ కాలేజ్ గ్రౌండ్స్‌కు చేరుకుంటారు. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు వచ్చే పారిశ్రామికవేత్తలు, ప్రతినిధులకు స్వాగతం పలుకుతారు. 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జీఐఎస్ సదస్సులో పాల్గొంటారు. లంచ్ అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు ఎగ్జిబిషన్ ఏరినాను ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జీఐఎస్ ప్రతినిధులతో నిర్వహించే ద్వైపాక్షిక సమావేశంలో పాల్గొంటారు. అనంతరం హోటల్‌కు చేరుకొని సాయంత్రం 6.20 నుంచి 7.45 వరకు విశ్రాంతి తీసుకుంటారు. రాత్రి 8 నుంచి ఎంజీఎం పార్క్ హోటల్‌లో జీఐఎస్ డెలిగేట్స్‌కు ఏర్పాటుచేసిన ప్రత్యేక విందులో పాల్గొంటారు. అనంతరం హోటల్‌కు చేరుకొని రాత్రి అక్కడే బస చేస్తారు.
- శనివారం ఉదయం 9.15 నుంచి 10.45 గంటల వరకు రెండో రోజు గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ ద్వైపాక్షిక సమావేశంలో పాల్గొంటారు. 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ముగింపు సమావేశంలో పాల్గొంటారు. అనంతరం రోడ్డు మార్గంలో 2.20 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుంటారు. 2.30 గంటలకు విశాఖ నుంచి బయలుదేరుతారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ఎస్పీ గౌతమి సాలి

తుమ్మపాల: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ, బందోబస్తు ఏర్పాట్లపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, పోలీసులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళి ఉల్లంఘన జరగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో 49 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, వాటిలో 44 రెగ్యులర్ కాగా, ఐదు ఆక్సిలరీ కేంద్రాలని తెలిపారు. ఎస్పీ గౌతమి సాలి మాట్లాడుతూ అన్ని కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేకదృష్టి సారిస్తున్నట్టు తెలిపారు. ముందస్తు భద్రతా చర్యలను చేపట్టినట్టు చెప్పారు.ఈ సమావేశంలో సహాయ రిటర్నింగ్ అధికారి, డీఆర్వో పి.వెంకటరమణ, సీపీవో జి.రామారావు, జీఎస్‌వీఎస్ అధికారి మంజులావాణి, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం

జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై కలెక్టర్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గృహనిర్మాణ పనుల్లో జిల్లా మొదటి స్థానంలో ఉందని చెప్పారు. అందుకు కృషి చేసిన అధికారులకు అభినందనలు తెలిపారు. జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో మహిళల్లో రక్తహీనత ఉందని, వారిపై వైద్యారోగ్య శాఖ దృష్టి సారించాలన్నారు. స్పందన దరఖాస్తుల పరిష్కారం, జల్‌జీవన్ మిషన్, పారిశుధ్యం, గృహనిర్మాణం, గ్రామవార్డు సెక్రటరీల పనితీరుపై ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ప్రత్యేక అధికారులతో సమీక్షించారు. ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల్లో జిల్లా మొదటి స్థానంలో ఉండేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. మండలాల్లో సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. స్పందన కార్యక్రమంలో పారిశుధ్యం, విద్యుత్, సచివాలయాల పనితీరుపై అధికంగా ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. పనులు వేగవంతం చేస్తే మరిన్ని నిధులు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ ధాత్రీరెడ్డి, ఆర్డీవోలు చిన్నికృష్ణ, జయరాం , డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్ రవి పట్టాన్ శెట్టి

శ్రీవారి కల్యాణం చూతమురారండి

3 నుంచి ఉపమాక, వడ్డాదిల్లో కల్యాణ మహోత్సవాలు • నేటి అర్ధరాత్రి అంకురార్పణ • ప్రత్యేక ఏర్పాట్లు

శోభాయమానంగా ఉపమాక



ఉపమాక ఆలయంలో ధ్వజస్తంభం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టెంట్లు

నక్కపల్లి: ఉపమాక వెంకన్న ఆలయం శోభాయమానంగా దర్శనమిస్తోంది. గరుడాద్రిపై ఏకశిలపై వెలసిన లోకేశుని వార్షిక కల్యాణోత్సవాలు ఈ నెల 3వ తేదీ నుంచి 10వ తేదీ వరకూ అంగరంగ వైభవంగా జరుగుతాయి. 3వ తేదీన జరిగే కల్యాణం కోసం తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు ఆలయప్రాంగణాలను ఆకర్షణీయమైన రంగులతో తీర్చిదిద్దారు. ప్రధాన రాజగోపురం నుంచి ఐరన్‌క్యూలైన్లు ఏర్పాటు చేశారు. రాజగోపురం ఎదురుగా భక్తులు సేదతీరేందుకు షెడ్లు వేశారు. ధ్వజస్తంభం వద్ద టీటీడీ చేసిన ఏర్పాట్లు చూడముచ్చటగా ఉన్నాయి. జయవిజయుల వద్దనుంచి స్వామి దర్శనానికి వెళ్లే భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. శ్రీనివాసుని బంగారు ఆభరణాలు సబ్‌ట్రెజరీ నుంచి గురువారం తీసుకురానున్నారు. వీటితో అలంకరించి ఆస్థాన మండపంలో ఉంచి భక్తులకు దర్శనం కల్పిస్తారు.

నేడు అంకురార్పణ

శుక్రవారం జరిగే స్వామివారి కల్యాణానికి గురువారం అంకురార్పణ చేస్తారు. ఉదయం ఉపమాక మాడవీధుల్లో పెళ్లికావిడను ఊరేగిస్తూ స్వామివారి కల్యాణానికి అందరూ ఆహ్వానితులేనని తెలియజేస్తారు. సాయంత్రం సుదర్శన పెరుమాళ్లను ఉత్తర ఈశాన్య దిక్కుగా ఉన్న ప్రాంతానికి పుట్టమన్ను కోసం తీసుకెళ్తారు.అనంతరం అంకురార్పణ పూజలు నిర్వహించి అశ్వవాహనంపై స్వామివారి తిరువీధి సేవలు నిర్వహిస్తారు.

200 మందితో బందోబస్తు

ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సుమారు 200 మందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు నక్కపల్లి సీఐ నారాయణరావు తెలిపారు. నలుగురు సీఐలు, 22 మంది ఎస్ఐలు,ఆర్మ్‌డ్ రిజర్వ్‌పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. స్వామివారి పుష్కరిణి వద్ద గజ ఈతగాళ్లను సిద్ధం చేశామన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా నక్కపల్లిలోనే వాహనాలు నిలిపివేస్తామని చెప్పారు. ఉపమాక గ్రామానికి నలువైపులా ఉన్న మార్గాల నుంచి మార్చి 3వ తేదీ ఉదయం నుంచి 4వ తేదీ ఉదయం వరకు వాహనాలు రాకుండా నిలిపివేస్తామన్నారు. రూట్ మ్యాప్ కూడా సిద్ధం చేసినట్టు ఆయన తెలిపారు. ఈవ్‌టీజింగ్, దొంగతనాలపైకూడా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. సీసీ కెమెరాల ద్వారా మానటరింగ్ చేయనున్నట్టు చెప్పారు.



ప్రధాన రాజగోపురం ఎదురుగా భక్తుల కోసం ఏర్పాటు చేసిన క్యూలైన్లు

ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభం



3వతేదీ శుక్రవారం ఉదయం ధ్వజస్తంభం వద్ద ధ్వజపటాన్ని ఎగురవేస్తాం. స్వామివారి కల్యాణానికి అష్టదిక్పాలకులను ఆహ్వానిస్తాం. ఈ కార్యక్రమంతో స్వామివారి ఉత్సవాలు లాంఛనంగా ప్రారంభమవుతాయి. గురువారం ఉదయం స్వామివారికి నిత్యకార్యక్రమాలు పూర్తిచేసి దర్శనాల అనంతరం పెళ్లికావిడ ఊరేగింపు, కవాట బంధనం, ఆలయ శుద్ధి వంటి కార్యక్రమాలు నిర్వహిస్తాం. సాయంత్రం అంకురార్పణ జరుగుతుంది.

–జి వరప్రసాదాచార్యులు, ప్రధానార్చకులు

సర్వాంగ సుందరంగా వడ్డాది



కల్యాణ మహోత్సవాలకు ముస్తాబైన ఆలయం

బుచ్చెయ్యపేట: ఉత్తరాంధ్రలోనే ప్రసిద్ధి చెందిన వడ్డాది వేంకటేశ్వరస్వామి 150వ కల్యాణ మహోత్సవాలను ఘనంగా నిర్వహించడానికి దేవస్థానం అధికారులు, వంశపారంపర్య ధర్మకర్త మండలి సభ్యులు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేశారు. శుక్రవారం నుంచి మంగళవారం వరకు ఐదు రోజుల పాటు ఈ మహోత్సవాలు జరుగుతాయి. గురువారం అర్ధరాత్రి అంకురార్పణ చేస్తారు. స్వామి వారి దొంగపెళ్లితో కల్యాణ వేడుకలు ప్రారంభం కానున్నాయి. ఏటా స్వామి వారి కల్యాణ వేడుకలను తిలకించడానికి రాష్ట్రం నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివస్తారు. కల్యాణ ఉత్సవాలకు స్వామి కొలువై ఉన్న గిరిజాంబ కొండను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.



శ్రీదేవి,భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి

వంద మంది పోలీసులతో బందోబస్తు :ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వంద మందితో ఎస్ఐ కుమారస్వామి పోలీసుబందోబస్తు ఏర్పాటు చేశా రు. క్యూలైన్లు,మంచినీటి సదుపాయం,వైద్య సేవలు అందేలా ఆలయ ధర్మకర్త దొండా కన్నబాబు,ఈవో శర్మ చర్యలు చేపట్టారు. ఆలయ పరిసర ప్రాంతాలు,మెట్ల మార్గం,కళావేదిక తదితర ప్రాంతాల్లో రంగులు వేసి, మిరుమిట్లు గొలుపే భారీ విద్యుత్ దీపాల సెట్టింగ్‌లను ఏర్పాటు చేశారు. కల్యాణ వేదికను అందంగా తీర్చిదిద్దారు. ధ్వజస్తంభంవద్ద, ఆలయంలోను,ఉత్సవ విగ్రహాల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేశారు.

కార్యక్రమాలు ఇలా.. : 3వ తేదీ ఏకాదశి నాడు స్వామి వారికి సహస్ర, అష్టోత్తర నామాలతో పూజలు హోమాలు,గజ,గరుడ వాహనాలపై తిరువీధి ఉత్సవం,రాత్రి 9 గంటలకు కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. 4వ తేదీన ప్రత్యేక పూజలు, హోమాలు, 5వ తేదీన సదస్యం,హోమాలు,తిరువీధి ఉత్సవం,6వ తేదీన పూజలు, 7వ తేదీ ఉదయం 9గంటలకు పూర్ణాహుతి,నాగవల్లి వసోంతోత్సవం,స్వామివారి తిరువీధి ఉత్సవం,చక్రస్నానంతో ఉత్సవాలు ముగుస్తాయి. 8వ తేదీన రాత్రి పుష్పయాగోత్సవం,పవళింపు సేవ నిర్వహించనున్నట్టు ఆలయ ధర్మకర్త దొండా కన్నబాబు,ఈవో శర్మ తెలిపారు. ఉత్సవాల సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

క్లుప్తంగా

20 ఎకరాల్లో జీడి తోటలు దగ్ధం



అగ్నికి ఆహుతైన చెట్లు

రావికమతం: మండలంలోని సామాలమ్మ పర్వతం సమీపంలోని నేరేడుబంద,ఆజీయపురం గ్రామాల అడవుల్లో మంగళవారం రాత్రి అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో గిరిజన రైతులు డిప్పల అప్పారావు,వంతల రామదాసు,ప్రకాష్‌రాజ్,విజయ్‌కుమార్,చిరంజీవి,పాంగి దాసు స్వామి, సూరిబాబులకు చెందిన సుమారు 20 ఎకరాల్లోని జీడిమామిడి తోటలు దగ్ధమయ్యాయి. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టామని, చెట్లు బాగా పూతపూయడంతో ఈ ఏడాది మంచి దిగుబడి వస్తుందని భావించామని, ఇంతలోనే ప్రమాదం జరిగిందని రైతులు వాపోయారు. దీంతో తీవ్రంగా నష్టపోయామని తెలిపారు.

అగ్నికి ఆహుతైన సరుగుడు, జీడి,టేకు చెట్లు

మునగపాక: మండలంలోని కాకరాపల్లిలో బుధవారం మధ్యాహ్నం జరిగిన అగ్ని ప్రమాదంలో టేకు, జీడి, సరుగుడు తోటలు కాలిబూడిదయ్యాయి. రెండున్నర ఎకరాలకు సంబంధించి రూ.2లక్షల మేర నష్టం జరిగి ఉంటుందని అంచనా వేస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి. కాకరాపల్లికి చెందిన కాకర త్రినాథరావు, ఇల్లా పోతురాజు సరుగుడు, జీడి, టేకు చెట్ల పెంపకం చేపడుతున్నారు. బుధవారం మధ్యాహ్నం అకస్మాత్తుగా చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. విషయం తెలుసుకున్న అనకాపల్లి అగ్నిమాపక శాఖ అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. కాగా రూ.2లక్షల మేర నష్టం జరిగి ఉండవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు.

యువతి అదృశ్యం

చోడవరం రూరల్: మండలంలోని వెంకన్నపాలెం గ్రామానికి చెందిన నాగమణి(20) అనే యువతి గత నెల 27వ తేదీన అదృశ్యమైంది. తండ్రి పైడినాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్‌ఐ ఎస్.వి.రమణ తెలిపారు.

రహదారులకు మహర్దశ

- విజయవంతంగా పూర్తయిన పనులు
- ఎన్నో ఏళ్ల నాటి కల నెరవేరిందంటున్న గ్రామీణులు
- డిప్యూటీ సీఎం చొరవ వల్లే ఇది సాధ్యమైందని కితాబు



గాదిరాయి కృష్ణాపురం రోడ్డు (నాడు)



గాదిరాయి కృష్ణాపురం రోడ్డు (నేడు)

మాడుగుల: నియోజకవర్గంలోని గ్రామీణ రహదారుల రూపురేఖలు మారుతుండడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడి వారు గతంలో మండల కేంద్రాలకు రావాలంటే కొండలు, గుట్టలు ఎక్కి రావాల్సి వచ్చేది. గోతులమయమైన దారిలో అవస్థలు పడాల్సి వచ్చేది. ప్రమాదాలు కూడా జరిగేవని మారుమూల గ్రామాల ప్రజలు చెబుతున్నారు. ప్రస్తుతం డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు కృషి ఫలితంగా గ్రామీణ రహదారులకు మహర్దశ పట్టిందని పలు గ్రామాలకు చెందిన గిరిజనులు, సన్న-చిన్నకారు రైతులు ఆనందంగా చెందుతున్నారు. నియోజకవర్గంలోని మాడుగుల మండలంలో రూ. 48 లక్షలతో వీరనారాయణం నుండి గదబూరుకు 1.4 కిలోమీటర్లు, రూ. 90 లక్షలతో గాదిరాయి నుండి ఎం.కృష్ణాపురానికి రెండు కిలోమీటర్లు, రూ. 60 లక్షలతో ఎం.కోడూరు ఆర్ అండ్ బీ రోడ్డు నుండి ఒకే శ్రీరాంపురం వరకు 1.87 కిలోమీటర్లు, రూ. 62 లక్షలతో పాడేరు ఆర్ అండ్ బీ రోడ్డు నుండి చినకూర్మం, చీడికాడ మండలంలో రూ. 35 లక్షలతో ఖండివరం నుండి కొండెంపూడి వరకు 0.77 కిలోమీటర్లు, రూ. 69 లక్షలతో బి. సింగవరం నుండి సూర్యనారాయణపురం వరకు 3.35 కిలోమీటర్లు, దేవరాపల్లి మండలంలో రూ. 25 లక్షలతో గవరవరం కలిగొట్ల ఆర్ అండ్ బీ రోడ్డు నుండి కొత్తూరు వరకు 1.60 కిలోమీటర్లు, అదే విధంగా మారేపల్లి నుండి చేనులపాలెం వరకు, దేవరాపల్లి పినకోట ఆర్ అండ్ బీ రోడ్డు నుండి శంభువానిపాలెం వరకు, కుండ గంగుపూడి నుండి చింతలపూడి వరకు, కె.కోటపాడు మండలం చౌడువాడ నుండి పైడంపేట వరకు.. ఇలా పలు రహదారుల నిర్మాణం దాదాపు పూర్తి కావడంతో గ్రామీణ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కల నెరవేరింది

వర్షం కురిస్తే నానా అవస్థలు పడేవారం. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు కృషి ఫలితంగా రోడ్డు పూర్తయింది. గాదిరాయి, కృష్ణాపురం గ్రామాలకు రహదారి కష్టాలు తీరాయి. రోడ్డు పనులు నాణ్యంగా జరగడంతో చాలా ఆనందంగా ఉంది.

– పత్రే రామునాయుడు, రైతు, గాదిరాయి.

ఇబ్బందులు తీరాయి

మా గ్రామం మారుమూలన ఉండడం వలన ఇంత వరకు ఎవరూ పట్టించుకోలేదు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు మేము అడగకుండానే మా గ్రామానికి రోడ్డు మంజూరు చేశారు. పనులు కూడా పూర్తయ్యాయి. చాలా ఆనందంగా ఉంది. మాకు కొత్తగా పంచాయితీ ఏర్పడింది. ఇపుడిపుడే డిప్యూటీ సీఎం కృషితో అభివృద్ధి జరుగుతోంది.

–మొల్లి అప్పారావు, రైతు, కృష్ణాపురం.

మాట తప్పని నేత

పెన్షన్ లేని మహిళకు సొంత నగదుతో పింఛన్ సొమ్ము అందజేసిన డిప్యూటీ సీఎం బూడి



వరహాలమ్మకు నగదు అందిస్తున్న జిల్లా వైఎస్సార్ సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు అనురాధ

కె.కోటపాడు: చౌడువాడలో గత నెల 9న నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు గ్రామానికి చెందిన చిన్ని వరహాలమ్మ ఆర్థిక ఇబ్బందులను స్వయంగా విన్నారు. వృద్ధురాలైన తల్లి సన్నమ్మ (85)తో కలిసి జీవిస్తున్నట్లు వరహాలమ్మ తెలిపింది. ఎవరి ఆసరా లేదని.. తల్లిని తానే స్వయంగా చూసుకుంటున్నట్లు వివరించింది. వివాహం చేసుకోకపోవడం.. తన వయస్సు 50 ఏళ్లు నిండకపోవడంతో ఒంటరి మహిళ పెన్షన్‌కు కూడా అర్హత లేదని వాపోయింది. తల్లికి వస్తున్న పెన్షన్‌తోనే జీవనం గడుపుతున్నట్లు వివరించింది. వరహాలమ్మ ఆర్థిక ఇబ్బందులు గుర్తించిన డిప్యూటీ సీఎం చలించిపోయారు. ప్రతినెలా 1వ తేదీనే సొంత నగదు రూ.2750 ఇంటికే నేరుగా అందించనున్నట్లు ఆయన తెలిపారు. అన్న మాట ప్రకారం చౌడువాడలో వరహాలమ్మ ఇంటికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు రూ.2750 నగదును ఆయన కుమార్తె, జిల్లా వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు ఈర్లె అనురాధ చేతుల మీదుగా అందించారు. ఆయన ఔదార్యానికి వరహాలమ్మ, ఆమె తల్లి సన్నమ్మలతో పాటు గ్రామస్తులు కూడా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీరాజు, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్, వార్డు మెంబర్ చల్లా సురేష్, మిర్తిపాటి నాగేశ్వరరావు, ఆకుల సాయిప్రసాద్ పాల్గొన్నారు.

యువకుడి హత్య కేసులో మేనమామ అరెస్టు



మాట్లాడుతున్న సీఐ గఫూర్

మునగపాక: మండలంలోని గణపర్తిలో జరిగిన యువకుడి హత్యకేసులో మేనమామను బుధవారం అరెస్టు చేసినట్టు యలమంచిలి సీఐ గఫూర్ తెలిపారు. గణపర్తిలో మంగళవారం రాత్రి జరిగిన హత్యకు సంబంధించిన వివరాలను ఆయన విలేకరులకు వెల్లడించారు. నర్సీపట్నానికి చెందిన గాలి శ్రీను, అతని మేనల్లుడు భీమిరెడ్డి లోవరాజు పరవాడ మండలం తానాంలో నివాసం ఉంటూ మునగపాక మండలం గణపర్తి సచివాలయ సమీపంలో చికెన్ షాపు నిర్వహిస్తున్నారు. లోవరాజు తల్లిదండ్రులు చనిపోవడంతో మేనమామ శ్రీను వద్దే పెరిగాడు. ఆరు నెలలుగా లోవరాజు మద్యానికి బానిసై మాంసం దుకాణంలోని నగదు తీసుకుపోవడం, బాధ్యత లేకుండా ప్రవర్తించడం వంటి అంశాలపై తరచూ ఇద్దరి మధ్య గొడవలు జరిగాయి. అయినప్పటికీ లోవరాజులో మార్పు రాకపోవడంతో విసుగుచెందిన శ్రీను ఎలాగైనా చంపేయాలని నిర్ణయించుకున్నాడు. మంగళవారం రాత్రి ఇరువురి మధ్య మళ్లీ వివాదం తలెత్తడంతో సహించలేని శ్రీను తన మేనల్లుడు లోవరాజు తలను కత్తితో నరికి వేశాడు. తల భాగాన్ని గోనె సంచిలో పెట్టి షాపులోనే ఉంచాడు. మొండెం భాగాన్ని అక్కడే పెట్రోల్‌తో కాల్చివేశాడు. ఈ సమయంలో దుర్వాసన, పొగలు రావడాన్ని గుర్తించిన స్థానికులు అనుమానం వచ్చి చికెన్ షాపులోకి వెళ్లి చూసి నివ్వెరపోయి, పోలీసులకు ఫోన్ ద్వారా తెలిపారు. అప్పటికే సంఘటనా స్థలం నుంచి శ్రీను పారిపోతుండగా అరెస్టు చేసినట్టు సీఐ గఫూర్ తెలిపారు. మృతదేహాన్ని అనకాపల్లి వందపడకల ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించినట్టు సీఐ చెప్పారు.

విద్యుత్ తీగ పడి గడ్డి వాము దగ్ధం

కాలినగాయాలతో ఆవు మృతి



దగ్ధమైన గడ్డి వాము

రోలుగుంట: విద్యుత్ తీగపడి గడ్డివాము దగ్ధం కాగా, అక్కడే మేస్తున్న ఓ ఆవు కాలిన గాయాలతో మృతిచెందింది. మండలం బి.బి.పట్నం శివారు పొలాల్లో కరెంటు తీగ ఎం.కె.పట్నం గ్రామానికి చెందిన సింగంపల్లి అప్పలనాయుడికి చెందిన గడ్డివాముపై పడి మంటలు రేగాయి. ఆ సమీపంలో గడ్డి మేస్తున్న అప్పలనాయుడికి చెందిన ఆవు కాలిపోయి మృతి చెందింది. స్థానికుల సమాచారం మేరకు నర్సీపట్నం అగ్నిమాపక సిబ్బంది వచ్చినా ఫలితం లేకపోయింది. బాధితుడు అప్పలనాయుడు విద్యుత్‌శాఖ అధికారులకు ఫిర్యాదు చేశాడు.

ఇసుక లారీ సీజ్

చోడవరం రూరల్: మండలంలోని ముద్దుర్తి గ్రామ జంక్షన్ వద్ద ఇసుక అక్రమంగా తరలిస్తున్న లారీని సీజ్ చేసి, డ్రైవర్‌ను అరెస్టు చేసినట్టు ఏఎస్‌ఐ ఎన్.వి.రమణ తెలిపారు. ఎం.కొత్తపల్లి గ్రామానికి చెందిన పల్లా శ్రీను బుధవారం లారీతో అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా పట్టుకున్నట్టు చెప్పారు. లారీని చోడవరం పోలీస్ స్టేషన్‌కు తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

కోడిపందాల నిర్వాహకులపై కేసులు

రూ.16,880 నగదు, 9 కోళ్లు స్వాధీనం

అనకాపల్లిటౌన్: జిల్లావ్యాప్తంగా జూదం, కోడిపందాలు నిర్వహిస్తున్న వారిపై దాడులు నిర్వహించినట్టు ఎస్పీ గౌతమి సాలి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కోడిపందాలు నిర్వహిస్తున్నవారిపై మూడు కేసులు నమోదు చేసి 14మందిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.16,880 నగదు, 9 కోళ్లను స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నారు. ఎస్‌ఈబీ అధికారులు దాడులు నిర్వహించి 3 కేసులు నమోదు చేసి 11 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నారు. బహిరంగప్రదేశాల్లో మద్యం సేవించి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న 37 మందిపై కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు. ఎంవీ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై 353 కేసులు నమోదు చేసి, రూ.84,561 అపరాధ రుసుం విధించినట్టు తెలిపారు.

టిప్పర్‌ను ఢీకొన్న లారీ



కశింకోట వద్ద ప్రమాదంలో దెబ్బతిన్న లారీ

కశింకోట: జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో టిప్పర్‌ను ఓ లారీ ఢీకొంది. బయ్యవరం నుంచి పరవాడకు బొగ్గు లోడుతో వెళుతున్న టిప్పరును అదే మార్గంలో వస్తున్న మరో లారీ ఢీకొంది. దీంతో బొగ్గు లారీ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని ఆగింది.ఎడమ వైపు ముందు భాగం, అద్ద ఒకవైపు దెబ్బతిన్నాయి. అదృష్టవశాత్తు ఎవరికీ హాని జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

యూకలిప్టస్ తోటలు దగ్ధం



మంటల్లో కాలిపోతున్న యూకలిప్టస్ తోటలు

చోడవరం రూరల్: మండలంలోని దుడ్డుపాలెం గ్రామంలో బుధవారం రాత్రి సంభవించిన అగ్నిప్రమాదంలో మూడు ఎకరాల్లోని యూకలిప్టస్ తోటలు కాలిపోయాయి. గ్రామానికి చెందిన గుమ్మడి మనోరంజన్‌కు చెందిన యూకలిప్టస్ తోటలకు రాత్రి 9 గంటల సమయంలో ప్రమాదవశాత్తూ నిప్పంటుకుంది.

ప్రమాదంలో సుమారు రూ. 90 వేల రూపాయల మేర నష్టం వాటిల్లి ఉంటుందని బాధితుడు మనోరంజన్ తండ్రి ప్రసాద్ వాపోయారు. కొండపెడన ఉండడంతో మంటలను అదుపు చేయడం వీలు పడలేదన్నారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందజేశారు. మంటలను అదుపు చేసే పనిలో సిబ్బంది నిమగ్నమయ్యారు.

బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో సత్తా చాటిన జ్యోత్స్న



జ్యోత్స్నకు నగదు, మెమొంటో అందజేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం (అనకాపల్లి): వాడచీపురుపల్లి విద్యార్థిని వడ్లపూడి జ్యోత్స్న బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో సత్తా చాటి నగదు బహుమతితో పాటు అవార్డు దక్కించుకుంది. మండలంలోని నునపర్తి శ్రీరామ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన జ్యోత్స్న గత నెల 16 నుంచి 20 వరకూ తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లా మంచిర్యాలలో నిర్వహించిన 61వ జాతీయ స్థాయి సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఏపీ తరఫున రెండవ స్థానంలో నిలిచింది. ప్రతిభ చాటిన ఆమె ఓవరాల్ స్పోర్ట్స్ అవార్డు, రూ. మూడు వేల నగదు సాధించినట్లు అచ్యుతాపురం బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు గొంప నరసింహనాయుడు తెలిపారు.

ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా బాబూరావు



రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణతో నూతనంగా ఎన్నికైన జిల్లా కార్యవర్గం

సబ్బవరం: ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అనకాపల్లి జిల్లా నూతన అధ్యక్షుడిగా సబ్బవరం మండల పరిషత్ ఏవో ఎస్. బాబూరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ అధ్యక్షతన విశాఖలో నిర్వహించిన సమావేశంలో అధ్యక్షుడితో పాటు మిగిలిన కార్యవర్గాన్ని సభ్యులంతా ఏకగ్రీవంగా ఎనుకున్నారు. అసోసియేట్ అధ్యక్షుడిగా బీవీ రావును, ఉపాధ్యక్షులుగా ఎ. నాగేశ్వరరావు, పీవీ రమణ,రామలింగేశ్వరరావు, జె. అప్పారావు ఎన్నికయ్యారు. ఆర్గనైజింగ్ సెక్రటరీగా రవికుమార్, సెక్రటరీగా ఐ. శ్రీనివాస్ కుమార్, జాయింట్ సెక్రటరీలుగా ఆర్‌వీఎస్ అప్పారావు, ఏవీఆర్ ప్రేమ్ కుమార్,జి. నాగేశ్వరరావు,వి. వెంకటరావులను, కోశాధికారిగా వైవీ రాజేశ్వరరావును ఎన్నుకున్నారు.

ఎంతందంగా ఉన్నావే..

'ఇంతందం దారి మళ్లిందా.. భూమిపైకే చేరుకున్నదా.. లేకుంటే చెక్కి ఉంటారా.. అచ్చు నీలా శిల్ప సంపదా.. జగత్తు చూడని.. మహత్తు నీదెలే.. ఈ నేలకే దిగేను.. కోటి తారలే.. దాసోహమంది ఈ ప్రపంచమే.. అందం నీ ఇంట.. చేస్తోందా ఊడిగమే.. యుద్ధం చాటింది.. నీపైన ఈ జగమే..' అంటూ ఓ సినీ గేయ రచయిత వర్ణించినట్టే విశాఖ సుందరి మారిపోయింది!



పార్క్ హోటల్ సర్కిల్‌లో సుందరీకరణ

- సుందరి నగరికి అదనపు అందం
- మిలమిల మెరుస్తున్న రోడ్లు
- పచ్చదనాన్ని పంచుతున్న చెట్లు
- కాంతులీనుతున్న విద్యుద్దీపాలు
- డివైడర్లు, విద్యుత్ స్తంభాలకు ఆకర్షణీయ రంగులు

సాక్షి, విశాఖపట్నం: ఈనెల 3,4 తేదీల్లో నిర్వహించే గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ (జీఐఎస్), 28, 29ల్లో జరిగే జీ-20 దేశాల సమ్మిట్‌లకు అందాల నగరి విశాఖ ఆతిథ్యం ఇస్తోంది. ఈ రెండు సదస్సులకు దేశ, విదేశాల నుంచి వచ్చే అతిరథ మహారథులకు తన సహజ సౌందర్యం, ప్రకృతి రమణీయతతో పాటు అదనపు అందాలతో ఈ అతిలోక సుందరి ఆహ్వానం పలుకుతోంది. జీఐఎస్, జీ-20 దేశాల సదస్సుల దృష్ట్యా కొద్దిరోజుల నుంచి నగరంలో సుందరీకరణ పనులు చేపడుతున్నారు. రోడ్లకు మరమ్మతులు చేపట్టి అద్దాల్లా తయారు చేశారు. రోడ్ల డివైడర్లపై పచ్చదనాన్ని పెంచే మొక్కలను నాటారు. ఫుట్‌పాత్‌లను టెర్రా కోట్‌తో సరికొత్తగా తయారు చేశారు. డివైడర్లకిరువైపులా ఉండే మీడియన్‌లకు, బీచ్ రోడ్డులో విద్యుత్ స్తంభాలకు ఆకర్షణీయమైన రంగులు అద్దారు. బీచ్ రోడ్డు నుంచి భీమిలి వరకు రోడ్డు డివైడర్లకు రంగులు వేశారు. బీచ్ రోడ్డులో డిజిటల్ లైటింగ్‌ను ఏర్పాటు చేశారు. ఇంకా రోడ్ల పక్కన గోడలపై అందమైన ఆకృతులతో కూడిన చిత్రాలను రూపొందించారు. వీటిపై రాష్ట్రంతో పాటు విశాఖ సంస్కృతిని తెలియజేసే సందేశాత్మక చిత్రాలను వేశారు. తిమ్మాపురం నుంచి రుషికొండ వరకు ఎడమ వైపు నడక మార్గం టైల్స్‌కు రంగులు వేశారు. సీతకొండపై రాత్రి వేళ రంగులు కాంతులు వెదజల్లడానికి, సాగర్‌నగర్, సీతకొండ తీర ప్రాంతాల్లో అలలపై విద్యుత్ కాంతులు ప్రసరించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సాగర్‌నగర్ బీచ్‌లో 200కు పైగా కొబ్బరిచెట్లను నాటారు. ఎన్ఏడీ ఫ్లై ఓవర్‌పై విద్యుద్దీపాలతో అలంకరించారు. ఆర్కేబీచ్ తరహాలో జోడుగుళ్లపాలెం, సాగర్‌నగర్, అప్పికొండ బీచ్‌లను తీర్చి దిద్దుతున్నారు. ఇలా విశాఖ నగరంలో ఏ రోడ్డు చూసినా, ఏ మూలకెళ్లినా సహజ సౌందర్యంతో కూడిన అందాల ఆరబోతే కనిపిస్తోంది. జీఐఎస్, జీ-20 సమ్మిట్ల సందర్భంగా విశాఖ నగర సుందరీకరణకు రూ.100 కోట్లు వెచ్చిస్తున్నారు.

మంత్రముగ్ధులు కానున్న అతిరథులు

26 దేశాలకు చెందిన అతిరథ మహారథులు, అతిథులు, పెట్టుబడిదారులతో పాటు దేశంలోని ప్రఖ్యాత పారిశ్రామిక వేత్తలు ముఖేష్ అంబానీ, అదానీ, కుమార మంగళం బిర్లా, సంజీవ్ బజాజ్, సుచిత్రా ఎల్లా వంటివారు ఈ జీఐఎస్‌లో పాల్గొనడానికి వస్తున్నారు. వీరితో సహా నాలుగు వేల మంది అతిథులు హాజరవుతున్నారు. వీరంతా అందాలొలికించే విశాఖ నగరాన్ని చూసి మంత్రముగ్ధులు కానున్నారు.



సమ్మిట్ హోర్డింగులు, పచ్చదనంతో హొయలొలుతుకుతున్న సిరిపురం జంక్షన్



ఉడా పార్క్ వద్ద గోడలపై వేసిన చిత్రాలు

నిఘా నీడలో..

- ప్రతిష్టాత్మక సదస్సుకు పటిష్ట భద్రత
- ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై ప్రత్యేక దృష్టి
- సదస్సుకు వచ్చే వారి కోసం ప్రత్యేక పార్కింగ్ ఏర్పాట్లు
- ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న సీపీ శ్రీకాంత్



దొండపర్తి(విశాఖ దక్షిణ): ప్రతిష్టాత్మక గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ ప్రశాంతంగా జరిగేందుకు పోలీస్ శాఖ పటిష్ట ఏర్పాట్లు చేస్తోంది. ఒకవైపు 2,500 మంది అధికారులు, సిబ్బందితో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపడుతూనే మరోవైపు ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై కూడా ప్రత్యేక దృష్టి సారించింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ నెల 3, 4 తేదీల్లో ఏయూ ఇంజనీరింగ్ కాలేజ్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న ఈ జీఐఎస్‌కు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి, కేంద్రమంత్రుల, దేశంలోని వ్యాపార దిగ్గజాలతో పాటు దేశ, విదేశాల నుంచి ప్రతినిధులు హాజరుకానున్నారు. వీరి భద్రత కోసం నిరంతరం నిఘాతో పాటు ప్రజలకు, సదస్సుకు వచ్చే వీవీఐపీ, వీఐపీ, ఇతర ప్రతినిధులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రణాళికాబద్ధంగా ట్రాఫిక్ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ రెండు రోజులు ఏయూ పరిసర ప్రాంతాలు రద్దీగా ఉండే అవకాశముంది. దీంతో ప్రజలు, వాహనదారుల సౌకర్యార్థం పోలీసులు పలు సూచనలు చేశారు.


నిరంతర నిఘా

- నగరంలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని హోటల్స్, లాడ్జీలు, రిసార్టులు, గెస్ట్ హౌస్‌ల్లో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారు.
- ఏయూ ఇంజనీరింగ్ కాలేజ్ గ్రౌండ్‌లో సదస్సు ప్రాంగణం, హెలిపాడ్, ప్రతినిధులకు వసతి కల్పించే హోటళ్ల వద్ద స్నిఫర్ డాగ్, బాంబు స్క్వాడ్స్‌తో క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు.
- నగరంలో ముఖ్య ప్రాంతాల్లో పికెట్స్, గార్డులను ఏర్పాటు చేసి నిరంతరం వాహనాలను తనిఖీ చేస్తున్నారు.
- నగర కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ పలు శాఖల అధికారులతో పాటు, రాష్ట్ర అధికారులతో సమావేశాలు నిర్వహిస్తూ భద్రతా, ఇతర ఏర్పాట్లపై ఎప్పటికప్పుడు చర్చిస్తున్నారు.
- అలాగే బుధవారం ఏయూ కాన్వొకేషన్ ఆడిటోరియంలో జిల్లా అధికారులకు, పోలీస్ అధికారులకు, సిబ్బందికి బందోబస్తుపై పలు సూచనలు జారీ చేశారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై దృష్టి

సదస్సు జరిగే రెండు రోజులు ప్రజలు, వాహనదారులు పోలీసులకు సహకరిస్తూ రద్దీగా ఉండే ప్రాంతాల వైపు కాకుండా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ప్రయాణించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. ట్రాఫిక్ ఆంక్షలు దృష్ట్యా శుక్ర, శనివారాల్లో బీచ్‌కు వచ్చే వారు తమ వాహనాలను ఏపీఐఐసీ గ్రౌండ్‌లో పార్కింగ్ చేసుకోవాలని సూచించారు.

నేడు కిరండూల్-విశాఖ పాసింజర్ రద్దు



తాటిచెట్లపాలెం: కిరండూల్-విశాఖపట్నం (08552) పాసింజర్ స్పెషల్ రైలు నిర్వహణ కారణాల వల్ల గురువారం రద్దు చేసినట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు మార్పును గమనించి సహకరించాలని కోరారు.

సముద్రంలో మునిగి విశ్రాంత నేవీ ఉద్యోగి మృతి

అల్లిపురం: అన్న కుమారుడికి ఈత నేర్పుతూ ప్రమాదవశాత్తూ సముద్రంలో మునిగి విశ్రాంత మర్చంట్ నేవీ ఉద్యోగి మృతి చెందాడు. మహారాణిపేట పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం సాయంత్రం చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి సీఐ రమణమూర్తి తెలిపిన వివరాలివీ.. అంబుసరంగ వీధికి చెందిన అబ్దుల్ రహీం(58) విశ్రాంత మర్చంట్ నేవీ ఉద్యోగి. తన అన్న కుమారుడైన మహమ్మద్ అబ్దుల్ ఆస్విక్‌కు గోకుల్ పార్క్ వద్ద గల సముద్ర తీరంలో ఈత నేర్పుతున్నాడు. ఈత నేర్పుతూ అలసిపోయిన రహీం ఊపిరి రాడక నీటిలో మునిగిపోయి చనిపోయాడు.

క్లుప్తంగా

నేడు వెంకన్న కల్యాణోత్సవం

కశింకోట : మండలంలోని నరసింగబిల్లిలో వెలసి ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవం గురువారం ఉదయం 9.20 గంటలకు నిర్వహించడానికి సన్నాహాలు చేశారు. ఆలయాన్ని నూతనంగా నిర్మించిన తర్వాత 13 ఏళ్లగా ఈ ఉత్సవాన్ని ఇక్కడ ఏటా ఆనవాయితీగా పాల్గుణ మాసం శుక్ల ఏకాదశి రోజు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది బుచ్చియ్యపేటకు చెందిన మల్లపురెడ్డి కోటేశ్వరరావు, లీలావతి దంపతులు, జెట్టపురెడ్డితునికి చెందిన మారిశెట్టి రాజా సతీష్, సుజాత దంపతులతో వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణాన్ని నిర్వహించడానికి ఏర్పాట్లు చేశామని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

ఊడలమర్రిని తలపిస్తున్న తహసీల్దార్ కార్యాలయం


తహసీల్దార్ కార్యాలయ పైకప్పు నిండా ఊడలు

అనకాపల్లిటౌన్ : స్థానిక తహసీల్దార్ కార్యాలయం రోజురోజుకు ఊడలమర్రిని తలపిస్తోంది. మహావృక్షమైన రావిచెట్టు తన ఊడలు కార్యాలయం పెంకులు, గోడల్లోంచి ఊడలు చొచ్చుకొస్తున్నాయి. మరికొంతకాలమైతే కార్యాలయం పైభాగంతోపాటు గోడలు శిథిలావస్థకు చేరుతాయనే భావన వినిపిస్తోంది. గోడలు, పైకప్పుతోపాటు ఊడలు తొలగించి నూతనంగా పైకప్పు ఏర్పాటు చేయాలని ఆ శాఖాధికారులు కోరుతున్నారు.

టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం

కశింకోట : నరసింగబిల్లి గ్రామంలో టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి వేపాడ చిరంజీవిరావు విజయానికి మద్దతుగా బుధవారం పార్టీ శ్రేణులు ప్రచారం నిర్వహించారు. నరసింగబిల్లి, చింతలపాలెంలోని పాఠశాలలు, బ్యాంకులకు వెళ్లి ఓటర్ల నుంచి ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు కర్రి దుర్గినాయుడు, మేడిశెట్టి వెంకటరమణ, మండల పార్టీ అధికార ప్రతినిధి జెర్రిపోతుల నూకినాయుడు పాల్గొన్నారు.

అనకాపల్లిటౌన్ : టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి వేపాడ చిరంజీవిరావును గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ కోరారు. స్థానిక న్యాయ సముదాయం ఆవరణలో బుధవారం ఉన్న బార్ అసోసియేషన్ హాలులో న్యాయవాదులతో ఎన్నికల ప్రచారంలో భాగంగా మాట్లాడారు. చిరంజీవిరావుకు మొదటి ప్రాధాన్యతగా ఓటు వేసి గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

సార్	రాజా
కోనసీమ	సత్యనారాయణ స్క్రీన్-1
కింగ్	సత్యనారాయణ స్క్రీన్-2
వినరో భాగ్యము విష్ణుకథ	షిర్డిసాయి
డెడ్‌లైన్	పర్తిసాయి
ఆర్గానిక్ మామ హైబ్రీడ్ అల్లుడు	వెంకటేశ్వర
శ్రీదేవి శోభన్‌బాబు	శ్రీసత్య
వాల్తేరు వీరయ్య	రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు బుధవారం 5,884 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్	3,610	3,940
మొదటి రకం	3,390	3,670
రెండో రకం	3,150	3,500
మూడోరకం	3,000	3,140

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 44 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-8 యూనిట్లు, బీ పాజిటివ్-21 యూనిట్లు, ఓ పాజిటివ్ 12 యూనిట్లు, ఏబీ పాజిటివ్ -3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 293 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారికి 606 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ (ఫోన్‌నంబర్9441108144)ని సంప్రదించవచ్చు.

జమాదులపాలెం రోడ్డు పునరుద్ధరణకు చర్యలు


జమాదులపాలెం గ్రామానికి వెళ్లే రోడ్డు

కశింకోట : మండలంలోని జమాదులపాలెం గ్రామానికి వెళ్లే రోడ్డు పునర్నిర్మాణానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ రోడ్డుకు అవసరమైన నిధుల మంజూరు కోసం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డికి మంత్రులు నివేదించారు. నిధులు మంజూరైన వెంటనే వచ్చే నెలలో పనులు చేపట్టనున్నట్టు వైఎస్సార్‌సీపీ శ్రేణులు పేర్కొన్నారు. జమాదులపాలెం గ్రామంలో సుమారు రెండు వేల జనాభా ఉంటారు. వారు ఎక్కువ మంది కూలీలు. నిత్యం అనకాపల్లి, కశింకోట తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. జాతీయ రహదారి నుంచి జమాదులపాలెం గ్రామానికి సుమారు కిలో మీటరున్నర దూరం ఉంటుంది. ఈ గ్రామానికి ఉన్న పంచాయతీ రాజ్ శాఖకు చెందిన రోడ్డు దెబ్బతిని ఏళ్ల తరబడి గతుకులు పడి, అంచులు దెబ్బతిని ఉంది. దీంతో రాకపోకలకు ప్రజలు, ఉద్యోగులు ఇబ్బంది చెందుతున్నారు. ఏ మాత్రం అజాగ్రత్తగా వెళ్లినా ప్రమాదానికి కొని తెచ్చుకోవలసిన పరిస్థితి. గత టీడీపీ హయాంలో హామీ ఇచ్చినా రోడ్డు పునర్నిర్మాణానికి నోచుకోలేదు. ఈ నేపథ్యంలో దెబ్బతిన్న ముఖ్యమైన రోడ్లు పునర్నిర్మాణానికి, మరమ్మతులు చేపట్టడం కోసం అసెంబ్లీ నియోజక వర్గాల వారీగా ప్రభుత్వం ప్రతిపాదనలు కోరింది. దీంతో జమాదులపాలెం రోడ్డు పునర్నిర్మాణానికి మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రత్యేక శ్రద్ధతో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ద్వారా ముఖ్యమంత్రికి ప్రతిపాదించారు. దీంతో నిధులు త్వరలోనే మంజూరు కాగలవని, వచ్చే నెలలో పనులు ప్రారంభం కాగలవని పార్టీ వర్గాలు పేర్కొంటున్నారు.

నిధుల కోసం ప్రతిపాదనలు

జమాదులపాలెం గ్రామ రోడ్డు పునర్నిర్మాణానికి నిధుల మంజూరు కోసం రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ప్రభుత్వానికి ప్రతిపాదించారు. నిధులు మంజూరయ్యాక పనులు చేపట్టనున్నారు. రోడ్డు నిర్మాణంతో ప్రజల సమస్యలు తొలగి రవాణా సదుపాయం మెరుగుపడనుంది.

–కరక సోమునాయుడు, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు

అఖిలపక్ష నాయకుల ధర్నా


ధర్నా చేస్తున్న అఖిలపక్ష నేతలు

అనకాపల్లిటౌన్: సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి సొంత భవనం సమకూర్చాలని అఖిలపక్ష నేతలు డిమాండ్ చేశారు. కార్యాలయం ముందు అఖిలపక్ష నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సొంత భవన నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. జాతీయ రహదారికి కార్యాలయాన్ని తరలించే ఆలోచనను విరమించుకోవాలన్నారు. బైపాస్ రోడ్డులో కార్యాలయం ఏర్పాటు చేస్తే రోజుకు వందలాదిమంది కార్యాలయానికి రాకపోకలు సాగించేవారికి ఇబ్బందిగా మారే అవకాశముందని పేర్కొన్నారు. అందరికీ అందుబాటులో ఉండేలా పట్టణం నడిబొడ్డున ఏర్పాటు చేయాలని సబ్ రిజిస్ట్రార్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జోనల్ కార్యదర్శి వై.ఎన్.భద్రం, మండల కార్యదర్శి చెల్లూరు నాగరాజు, ఆప్ నేతలు కొణతాల హరనాథబాబు, సీహెచ్.శ్రీనివాసరావు, రైతుసంఘం నేతలు కోరిబిల్లి శంకరరావు, కొణతాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దళిత యువతికి న్యాయం చేయాలి


దళిత యువతికి న్యాయం చేయాలని కలెక్టరేట్ వద్ద నిరసన చేస్తున్న మహిళా సంఘాల ప్రతినిధులు

తుమ్మపాల : ప్రేమ పేరుతో యువతిని మోసం చేసిన ఘటనపై యలమంచిలి పోలీస్‌స్టేషన్‌లో అట్రాసిటీ కేసు నమోదు చేసిన దోషులను తక్షణమే అరెస్టు చేయాలని మహిళా సంఘాలు జిల్లా జియింట్ కలెక్టర్ కల్పనాకుమారి, ఎస్పీ గౌతమీసాలీకి వినతిపత్రం అందించారు. కలెక్టరేట్ గేటు వద్ద నిరసన తెలిపారు. దళిత యువతిని పెండ్లి చేసుకుంటానని మోసం చేసిన వ్యక్తిపై యువతి ఫిర్యాదు మేరకు గత నెల 20వ తేదీన కేసు నమోదు చేశారని మహిళా సంఘాల ప్రతినిధులు సిరపల్లి లలితాకుమారి, పిల్లా జ్యోతి తెలిపారు. మాకవరపాలెం మండలం బయ్యవరం గ్రామానికి చెందిన యువతిని అదే గ్రామానికి చెందిన ఆనందకుమార్ అనే వ్యక్తి ప్రేమపేరుతో మోసం చేశాడని తెలిపారు. నిందితుడితో పాటు తల్లి తులసిపై కేసు నమోదు చేసినప్పటికీ అరెస్టు చేయకుండా పోలీసులు కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు.

క్రషింగ్‌కు సరిపడా చెరకు సరఫరాకు ప్రయత్నించాలి


కార్మికులతో మాట్లాడుతున్న వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రామునాయుడు

చోడవరం: క్రషింగ్‌కు సరిపడా చెరకు సరఫరా అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని షుగర్ ఫ్యాక్టరీ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శరగడం రా మునాయుడు డిమాండ్ చేశారు. గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో మందకొడిగా జరుగుతున్న క్రషింగ్ తీరుపై కార్మికులతో బుధవారం సమావేశం నిర్వహించారు. గోవాడ షుగర్ ఫ్యాక్టరీకి రోజువారీ క్రషింగ్‌కు కావలసినంత చెరకును సరఫరా చేయించడంలో ఫ్యాక్టరీ ముఖ్య వ్యవసాయాధికారి (సీడీవో) నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రోజువారీ క్రషింగ్‌కు 4 వేల టన్నుల చెరకు సరఫరా కావాల్సి ఉండగా కేవలం 2 వేల టన్నులు మాత్రమే సరఫరా చేస్తున్నందున బాయిలర్ హౌస్ నిర్వహణ సక్రమంగా జరగక ఫ్యాక్టరీకి నష్టం వాటిల్లుతోందన్నారు. చెరకు లేక బాయిలర్ హౌస్‌లో సింగిల్ యూనిట్ నిర్వహించడంతో లక్షలాది రూపాయలు ఆదాయం చేకూర్చే బెగాస్ కూడా నష్టపోవాల్సి వస్తుందన్నారు. వెంటనే యాజమాన్యం చర్యలు తీసుకోవాలన్నారు.

వెంకన్న ఆలయ నిర్మాణానికి భూమిపూజ


తిమ్మరాజుపేటలో వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి భూమిపూజ

మునగపాక : తిమ్మరాజుపేటలో బుధవారం కలియుగ దైవం వేంకటేశ్వరుని ఆలయ నిర్మాణానికి డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్‌లు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దైవ చింతన అలవరుచుకోవాలన్నారు. ఆలయ నిర్మాణానికి స్థలం సమకూర్చిన శరగడం రామేశ్వరరావును అభినందించారు. డాక్టర్ విష్ణుమూర్తి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, సర్పంచ్ మంగలక్ష్మి, ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్, గొట్టుముక్కల వాసు, రామభద్ర నాయుడు, దివాకర్, ఆడారి గణేష్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

యువకుడిని హత్య చేసిన వారిని అరెస్టు చేయాలి


పోలీసుస్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న దళిత సంఘాల నాయకులు

పాయకరావుపేట : మండలంలో గల పీఎల్ పురం గ్రామంలో దళిత యువకుడైన వడ్లమూరి వీర నాగేంద్రను హత్య చేసిన వారిని పోలీసులు తక్షణమే అరెస్టు చేయాలని దళిత సంఘాల నాయకులు పోలీసుస్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. నాగేంద్రను హత్య చేసి, తాళ్లతో కాళ్లు, చేతులు కట్టేసి, బావిలో వేయడం కిరాతకం అని పలువురు దళిత సంఘాల నాయకులు పేర్కొన్నారు. దళిత బహుజన పార్టీ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్, అంబేద్కర్ ఇండియా విషన్ ప్రతినిధి కె.దిలీప్, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జె.వి.ప్రభాకర్, దళిత నాయకులు పెదపాటి మేఘరంజన్‌లు పోలీసుస్టేషన్ ఎదుట మృతుడు నాగేంద్ర బంధువులతో కలిసి ఆందోళన చేశారు. పాయకరావుపేట, నక్కపల్లి సీఐలకు ఫిర్యాదు పత్రాలను అందించారు. ఈ సందర్భంగా సీఐలు ఆందోళన కారులతో మాట్లాడుతూ నాగేంద్ర హత్యపై దర్యాప్తు నిర్వహించడం జరుగుతుందన్నారు. మృతుడు నాగేంద్ర ఫోన్‌కాల్స్ ఆధారంగా విచారణ చేయడం జరుగుతుందన్నారు. విచారణకు సహకరించాలని కోరారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహిస్తే మరికొన్ని విషయాలు తెలుస్తాయన్నారు.

ఇప్పటికే అనుమానితులను అదుపులోనికి తీసుకున్నట్లు తెలిపారు. ఇద్దరు సీఐలు, నలుగురు ఎస్ఐలు విచారణ చేపడుతున్నట్టు తెలిపారు. పోలీసుస్టేషన్ వద్ద ఆందోళన చేసిన వారిలో జిల్లా దళిత నాయకులు పల్లా విలియం కేరి, డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు వడలి శివప్రకాష్ ఉన్నారు.

గ్రామ వలంటీర్ ఔదార్యం

కశింకోట : అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధునికి సొంత ఖర్చుతో వెళ్లి వృద్ధాప్య పింఛన్ సొమ్ము బుధవారం అందజేసి అభినందనలు అందుకున్నారు. మండలంలోని కన్నూరుపాలెం(ఈ.చౌడువాడ) గ్రామానికి చెందిన చుక్క దేముడు అనారోగ్యంతో బాధపడుతూ నర్సీపట్నం మండలం గంగవరం గ్రామంలో తన కుమార్తె వద్ద ఉంటున్నారు. అతనికి వచ్చిన నెల వారీ వృద్ధాప్య పింఛను సొమ్మును కన్నూరుపాలెం గ్రామ వలంటీర్ కన్నూరు యమున సొంత ఖర్చుతో లబ్ధిదారుని వద్దకు వెళ్లి అందజేశారు. దీంతో యమునను సచివాలయ కార్యదర్శి ఎస్. సత్యారావు, సచివాలయ సిబ్బంది అభినందించారు.

ప్రత్యేక మొబైల్ ఆధార్ శిబిరాలు

కశింకోట : మండల గ్రామాల్లో ఆధార్ కార్డులో చేర్పులు, మార్పుల కోసం గురువారం నుంచి మూడు రోజులపాటు ప్రత్యేక మొబైల్ ఆధార్ శిబిరాలను నిర్వహిస్తున్నామని ఎంపీడీవో కొంకి అప్పారావు తెలిపారు. మొదటి రోజు గురువారం చింతలపాలెం, వెదురుపర్తి, 3, 4 తేదీల్లో ఏఎస్ పేట సచివాలయాల్లో శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. ఆయా ప్రాంతాల్లో ప్రజలు ఆధార్ కార్డులో మార్పులు, చేర్పులు, అప్ డేట్ చేయాల్సి ఉంటే చేసుకోవాలని కోరారు.

విస్తారంగా జనుము సాగు


దేవరాపల్లిలో సాగులో ఉన్న జనుము పంట

దేవరాపల్లి: మండలవ్యాప్తంగా జనుము పంటను రైతులు విస్తారంగా సాగు చేశారు. దేవరాపల్లితో పాటు రైవాడ, వెంకటరాజుపురం, వాకపల్లి, బోయిలకింతాడ, కలిగొట్ల తదితర గ్రామాల్లో రైతులు జనుము సాగు పట్ల ఆసక్తి చూపుతున్నారు. మండలంలో సుమారు 200 ఎకరాల్లో జనుము సాగవుతోంది. ప్రస్తుతం ఈ పంట పూత దశలో ఉంది. ఖరీఫ్ పంటల సాగుకు ముందు జనుమును పచ్చిరొట్ట ఎరువుగా సాగు చేసి భూమిలో కలియదున్నుతారు. తద్వారా భూమి సారవంతమై పంటల దిగుబడి ఆశాజనకంగా ఉండడంతో రైతులు జనుము సాగు పట్ల మక్కువతో ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు

రాంబిల్లి : కొత్తపేటలో బుధవారం దుర్గాంబిక అమ్మవారి విగ్రహ ప్రతిష్ట, ఆలయ ప్రారంభోత్సవ వేడుకల ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలుత గణపతి పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. యాగశాల ప్రవేశం ఇతర పూజాది కార్యక్రమాలను శాస్త్రోక్తంగా పురోహితులు నిర్వహించారు. సర్పంచ్ అరుణలత, గ్రామనాయకులు, భక్తులు పాల్గొన్నారు. ఈ నెల 3న ఆలయ ప్రారంభం, దుర్గాంబిక అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

రహదారి నియమాలు పాటించాలని ర్యాలీ

అచ్యుతాపురం(అనకాపల్లి): రహదారిపై ప్రయాణించేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని, రహదారి నియమాలను పాటించాలని విద్యార్థులు నినదించారు. అచ్యుతాపురం మండల కేంద్రం ఉన్నత పాఠశాల విద్యార్థులు బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో భాగంగా విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శించారు.

కొండ చుట్టూ ప్రహరీ వద్దు


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

రాంబిల్లి: తమ గ్రామాన్ని ఆనుకొని వున్న కొండను ఆనుకొని నేవీ నిర్మిస్తున్న ప్రహరీ గోడ పనులను నిలిపివేయాలని వై.లోవ గ్రామస్తులు ఆర్డీవో చిన్నికృష్ణ, తహసీల్దార్ పి.భాగ్యవతికి వినతి పత్రాలు అందజేశారు.

ఈ కొండపైకి వెళ్లకుండా ప్రహరీ గోడ నిర్మిస్తే తాము ఇబ్బందులు పడాల్సి వస్తుందని సర్పంచ్ బద్ది నారాయణరావు, మాజీ సర్పంచ్ బి.నారాయణరావుతో పాటు పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కొండ ప్రాంతం నుంచి పొలాల్లోకి వెళ్లే మార్గం వుందని, పశువుల మేతకు ఈ కొండ ఉపయోగపడుతుందని , వరదలు వచ్చినపుడు కూడా ఈ కొండపై పశువులను వుంచుతామని తెలిపారు. ఈ కొండను విడిచిపెట్టాలని కోరారు.

జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడికి సత్కారం

కోటవురట్ల: కె.వెంకటాపురంలో వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పైల రమేష్‌ను బుధవారం ఘనంగా సత్కరించారు. సర్పంచ్ పైల శ్రీదేవి మంగా ఇందిర భవానీ, వార్డు సభ్యులు, పార్టీ నాయకులు శాలువతో సత్కరించి అభినందించారు. కేక్ కట్ చేసి సంబరం జరిపారు.

సర్పంచ్ శ్రీదేవి మంగా ఇందిర భవానీ మాట్లాడుతూ తమ గ్రామం నుంచి జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడుగా ఎంపికవ్వడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. రమేష్ మాట్లాడుతూ పార్టీ అధిష్టానం తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. పార్టీ నాయకులు గొల్లు చిట్టిబాబు, పైల నాని, మాజీ సర్పంచ్ పైల శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

కంచి పీఠాధిపతిని కలిసిన ఎంపీ దంపతులు


స్వామిజీతో ఎంపీ సత్యవతి, విష్ణుమూర్తి దంపతులు


స్వామీజీ ఆశీస్సులు తీసుకుంటున్న దాడి రత్నాకర్

తుమ్మపాల : స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో బుధవారం కంచికామకోటి పీఠాధిపతి జగద్గురు శంకరాచార్య శంకర విజయేంద్ర సరస్వతి మహాస్వామిజీ అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. అంతకుముందు స్వామీజీని అధికసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఎంపీ సత్యవతి, విష్ణుమూర్తి దంపతులు, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్‌లు స్వామీజీని కలిసి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా దాడి రత్నాకర్ ఉత్తరాంధ్ర ఇలవేల్పు అనకాపల్లి నూకాంబిక అమ్మవారి ఆలయానికి రావాలని కోరగా గురువారం వస్తానని స్వామీజీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 82, 83 వార్డుల కార్పొరేటర్లు జాజుల ప్రసన్నలక్ష్మి, రమేష్, మందపాటి సునీత, జానకీరామరాజు దంపతులు, టీడీపీ మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉగాదికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి


తగరంపూడి జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు

అనకాపల్లి రూరల్: ఉగాది నాటికి ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని అందుకు అధికారులంతా లబ్ధిదారులకు సహాయ సహకారాలందించాలని అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు కోరారు. బుధవారం మండలంలోని తగరంపూడిలో జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను ఆయన, ఎంపీడీవో కె.ధర్మారావు, గృహనిర్మాణ శాఖ ఏఈ యుగంధర్, ఇతర మండలస్థాయి అధికారులు పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం బలహీన వర్గాలకు కేటాయించిన ఇళ్ల నిర్మాణాలను ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నందున లబ్ధిదారులంతా ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి రానున్న ఉగాది సమయానికి గృహప్రవేశాలు చేయడానికి సిద్ధమవాలని ఎంపీపీ సూచించారు. కార్యక్రమంలో తగరంపూడి సర్పంచ్ యాదగిరి అప్పారావు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఐతా ఆనంద్ రాము, వెంకుపాలెం సర్పంచ్ ఆర్.నాగేశ్వరరావు, మామిడిపాలెం ఎంపీటీసీ బి.అప్పలనాయుడు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఎస్తేరు, వెంకటేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చవితి వేడుకలకు ముందస్తు సన్నాహాలు


శిల్పి పందూరి సత్యనారాయణకు వినాయక ప్రతిమను అందించి అభినందిస్తున్న కుమారస్వామి

అనకాపల్లిటౌన్: ఈ ఏడాది సెప్టెంబర్ 23న వినాయకచవితి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు ప్రారంభిస్తున్నట్టు వినాయక సామూహిక నిమజ్జనోత్సవ కమిటీ వ్యవస్థాపకులు ఆడారి కుమారిస్వామి అన్నారు. పట్టణంలో పలు ప్రాంతాల్లో వినాయక ప్రతిమలను తయారు చేసే శిల్పులను కమిటీ సభ్యులు బుధవారం కలిసి వారి సలహాలు, సూచనలు తీసుకున్నారు. అంతకుముందు శిల్పి పందూరి సత్యనారాయణకు వినాయక ప్రతిమను అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కొడుకుల శ్రీకాంత్, పి.సోమశేఖర్‌పట్నాయక్ , ఆడారి శ్రీనివాసరావు, తిమ్మాపాత్రుని జయసూర్య, మావూరి వెంకటేష్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న క్రాఫ్ట్ ఎగ్జిబిషన్


కశింకోటలోని కేంబ్రిడ్జి స్కూలులో విద్యార్థులు తయారు చేసిన వస్తువులతో క్రాఫ్టు ఎగ్జిబిషన్


వ్యర్థ వస్తువులతో తయారు చేసిన బావి

కశింకోట : కశింకోటలోని కేంబ్రిడ్జి స్కూల్లో బుధవారం క్రాఫ్టు ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో విద్యార్థులు వ్యర్థ వస్తువులు, రంగు కాగితాలతో అందంగా తయారు చేసిన వివిధ రకాల వస్తువులను ఈ సందర్భంగా ప్రదర్శించారు. ఇవి ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ విలాసన్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత వెలికి తీయడానికి, వారిని ప్రతిభావంతులుగా తీర్చిదిద్దడానికి ఇటువంటి ప్రదర్శనలు దోహదం చేస్తాయన్నారు. అలాగే హానెస్టీ కౌంటర్ ఏర్పాటు ద్వారా విద్యార్థులను నిజాయితీ గల పౌరులుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

- ఏఐటీయుసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ్


సమావేశంలో మాట్లాడుతున్న కోన లక్ష్మణ్

అనకాపల్లి రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఏఐటీయుసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ్ డిమాండ్ చేశారు. మండలంలోని మూలపేట గ్రామంలో బుధవారం నిర్వహించిన భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల సంక్షేమం కోసం దశాబ్దాల నుంచి పోరాటం కొనసాగుతోందన్నారు. ఏఐటీయుసీ నాయకత్వంలో గతంలో సాధించుకున్న భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టాన్ని వెంటనే పునరుద్ధరించాలని కోరారు. సంక్షేమ బోర్డు అమలులోనికి వస్తే కార్మికులకు ఎన్నో సంక్షేమ పథకాలు, సదుపాయాలు అందుతాయని చెప్పారు. సమావేశంలో ఆలం శంకర్, చిన్ని, చిన్న, మారేడిపూడి సత్యనారాయణ, పల్లా నర్సింగరావు, ఉప్పిలి సత్తిబాబు, ఆదినారాయణ, రామునాయుడు పాల్గొన్నారు.

అయ్యన్నపాలెంలో ఆర్‌వో ప్లాంటు ఏర్పాటు


ఆర్‌వోప్లాంటును ప్రారంభిస్తున్న హెటిరో ప్రతినిధులు

నక్కపల్లి : ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించేందుకు తమ వంతు ఆర్థిక సాయం చేస్తున్నామని హెటిరో కంపెనీ డీజీఎంలు ప్రభాకర్, కుర్లాయి రెడ్డి , సుబ్బారెడ్డి తెలిపారు. మండలంలో ఉపమాక శివారు అయ్యన్నపాలెంలో రూ.13 లక్షలతో హెటెరో కంపెనీ ఏర్పాటు చేసిన ఆర్‌వోప్లాంట్‌ను వారు ప్రారంభించారు. కంపెనీ సీఎస్ఆర్ నిధులతో ఈ ప్లాంటు ఏర్పాటు చేసామన్నారు. కంపెనీ పరిసర ప్రాంతాల్లో ప్రజలకు కనీస అవసరాలు తీర్చేందుకు యాజమాన్యం ఎంతో కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కురందాసు నూకరాజు, కంపెనీ సిబ్బంది శ్రీనివాస్ పాల్గొన్నారు.